# వైకల్యానికి ఎదురొడ్డి వెలుగుపూలు పూయిస్తూ...

**స్త్రీల కష్టాలు స్త్రీలకే బాగా తెలుస్తాయన్నట్లు వికలాంగుల సాధకబాధకాలు గ్రహించాలంటే అది వికలాంగులకే ఎక్కువగా సాధ్యమవుతుంది. డెఫ్ విమెన్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (బధిర మహిళల అభివృద్ధి సంస్థ) ఆవిర్భావమూ అదేవిధంగా జరిగింది. చెవుడుతో పాటు మూగతనమూ వేధిస్తున్నా వాటిని తోసిరాజని, దైనందిన జీవితంలో తాను పైకెదగటమే కాక- తనవంటి వారెందరికో తోడ్పాటునిస్తున్నారు గౌరూ అనే ఆదర్శ మహిళ ఈ సంస్థ ద్వారా. బెంగుళూరులో రూపుదిద్దుకున్న ఈ ట్రస్టు నీడన నేడు మరెందరో మూగ, బధిర యువతులు ఆశ్రయం పొందుతూ ఉపాధినీ అందుకుంటోండటం అభినందనార్హం.**

కర్ణాటకలోని కూర్గ్ జిల్లా పొన్నంపేట తాలూకా కుందా గ్రామంలో పుట్టిన గౌరూ జన్మతః మూగ. దానికి తోడు బధిరత్వం కూడా ఉండటంతో బాల్యంలో కొంత ఇబ్బంది పడినా తల్లిదండ్రుల తోడ్పాటు చదువులో



జాతీయ అవార్డు అందుకుంటూ..

ఆమెను ముందుకెళ్లేలా చేసింది. దాంతో మైసూరులోని డెఫ్ & డమ్ స్కూల్లో ఎస్సెస్సెల్సీ వరకు చదివిన గౌరూ, ఆ తర్వాత స్వగ్రామం తిరిగొచ్చి అక్కడే టైలరింగ్ నేర్చుకోవటం ఆరంభించారు. వైకల్యమున్నా చురుకైన బుద్ధి కలిగిన ఆమె అనతికాలంలోనే కుట్టుతోపాటు, ఎంబ్రాయిడరీ, ఉలెన్ వస్తువులు, సాఫ్ట్ టాయెస్ తయారీ తదితరాలలో నేర్పు సంపాదించారు. కాలక్రమంలో తనకు మాదిరే వైకల్యమున్న సోమణ్ణను వివాహమాడి బెంగుళూరులో స్థిరపడ్డారు.

పెళ్లయ్యాక ఊరికే కూర్చోటం ఇష్టంలేక ఓ టైలరింగ్ షాపుని ఏర్పాటు చేసుకున్న గౌరి తన పనితనంతో ఎందరి ఆదరణనో పొందగలిగారు. అనేకమందిని తన ఖాతాదార్లుగా మార్చుకోగలిగారు. జీవితంలో ఇలా స్థిరపడ్డాక, వికలాంగులకు ప్రత్యేకించి ఇళ్లలోనే మగ్గుతున్న నిరాధార మూగ, బధిర యువతులకు ఆసరా కల్పించాలని ఆకాంక్షించారు. అలా ఆమె ఆలోచనల్లోంచి పుట్టుకొచ్చిందే డెఫ్ విమెన్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (డిడబ్ల్యుడిటి).

గౌరూ నెలకొల్పిన ఈ సంస్థ మూగ, బధిర యువతులు, మహిళలు అనేకమందిని చేరదీసి వారికి కుట్టు, ఎంబ్రాయిడరీ ఇంకా ఇతర హస్తకళల్లో ఉచిత శిక్షణ ఇస్తోంది. ఇవన్నీ గౌరూ ఆధ్వర్యంలోనే సాగుతున్నాయి. కేవలం శిక్షణ గరపటంతో సరిపుచ్చక ఆసక్తిగలవారికి తన గార్మెంట్ సంస్థలో ఉపాధినీ కల్పిస్తున్నారామె. అలాగే స్వయం ఉపాధి పొందాలనుకునేవారికి బ్యాంకుల నుంచి రుణాలు పొందేలా దిశానిర్దేశం చేస్తున్నారు. కర్ణాటక మహిళాభివృద్ధి సంస్థ సహకారంతో గార్మెంట్స్ ఎగ్జిబిషన్లలో తమ వస్త్రోత్పత్తులను ప్రదర్శిస్తుంటారు గౌరూ. ఇలాంటి అనేక విషయాల్లో ఆమెకు అండగా ఉంటారు మంగళా స్వామినాథ్ అనే తెలుగు మహిళ.



గవర్నరు నుంచి రాష్ట్రీయ అవార్డు అందుకుంటూ గౌరూ సోమణ్ణ

వికలాంగ యువతులకు ఆశ్రయమిచ్చి వారి కాళ్లపై వారు నిలబడేలా తీర్చిదిద్దుతూ ఆదర్శంగా నిలుస్తోన్న గౌరూ మరికొన్ని సంస్థల్లో సభ్యురాలిగా కొనసాగుతూ సేవాభిలాషను పెంచుకుంటున్నారు. భవిష్యదాశయాలను వివరిస్తూ- స్వగ్రామంలో మూగ, బధిర పాఠశాలను ప్రారంభించాలనుకుంటున్నానని, వికలాంగులు, వారి తల్లిదండ్రులకోసం ఓ కౌన్సెలింగ్ సెంటరును ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు చెప్పారు గౌరి 'వసుంధర'తో. తన శిక్షణ కేంద్రాన్ని మరింతగా అభివృద్ధిపరచి, ఔత్సాహిక వికలాంగ యువతులకు శిక్షణ, వసతి, ఉపాధి సౌకర్యాలను కల్పించటం ఉద్దేశంగా పేర్కొన్నారు. ఈ ప్రణాళిక ఫలవంతం కావటానికి ప్రజల (ఆర్థిక) సహకారం అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు.

తనకు వైకల్యమున్నా ఆత్మవిశ్వాసంతో దాన్ని అధిగమించి మరెందరో వికలాంగులకు చేయూతనిచ్చి స్ఫూర్తిగా నిలచిన గౌరూ సేవలకు గుర్తింపుగా అనేక సంస్థలు ఆమెను సత్కరించాయి. 1995లో అప్పటి రాష్ట్రపతి శంకర్‌దయాళ్ శర్మ ఆమెకు జాతీయ అవార్డు ప్రదానం చేయటం గౌరూ సేవలకు లభించిన నిజమైన గుర్తింపు. అలాగే గత ఏడాది ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా కర్ణాటక గవర్నరు రమాదేవి నుంచి కూడా రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్నారామె. ఈ అవార్డులు తనకు మధురానుభూతులు మిగిల్చాయనే గౌరూ- తమ దంపతులిద్దరూ వికలాంగులైనా కన్న సంతతికి మాత్రం అదేమీ సోకకపోవటం దైవానుగ్రహమని ఆనందం ప్రకటించారు.

వైకల్యం దేహానికే గాని, మనసుకు కాదని చాటుతూ ఆత్మవిశ్వాసంతో తాను ఉన్నతి పొందటమేకాక- ఎందరో అభాగినుల జీవితాల్లో వెలుగు పూలు పూయిస్తున్న గౌరూ జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకం.



వైకల్యాన్ని మరచి... వస్త్రాలను తీర్చిదిద్దుతూ...



బధిర యువతులకు కుట్టు శిక్షణ ఇస్తూ...

-జి.జగదీశ్వరి,
బెంగుళూరు